
# బుడుగు చంద్రలోకయాత్ర



మరి ఆ తరవాత చాలా బోల్డురోజులనించీ నేను మీకు కనిపించటంలేదుగందా! ఎంచేత కొన్ని వందలమంది నాకు వుత్తరాలు రాసేస్తున్నారు. మరిన్నాళ్ళూ, ఏం తమాషా, జరిగిందిటే!

అవ్వాళ ఆదివారం. యిస్కూలుకేమో శెలవు. నాన్నకూడా ఆఫీసుకి శెలవు. అంచేత, అమ్మ లడ్డూలుచేసింది. నాకేమో ఒకటో, మూడో పెట్టి మిగతావన్నీ దాచేసింది. అప్పుడు నాకు భలే కోపంవచ్చేసింది. అయినా మాంఛి అయిడియా తట్టిందిలే. రాత్రి అందరూ పడుకున్నాక, మెమ్మదిగా, వంటింట్లోకి (బామ్మ ఆఫీసు గది) వెళ్ళాను. లడ్డూల కారేజీ తీస్తుంటే ఎవడో వచ్చి వెనకనించి, నా కళ్ళు మూశాడు. "ఉత్తినే తీస్తున్నాను. నిజంగా తినటానికి కాదు" అని చెప్పినా వాడు వినలేదు. కొంచెం సేపు ఆగి, నన్ను దొడ్లోకి లాక్కుపోయాడు. ఆశ్చర్యం! అక్కడో విమానంవుంది. వాడు, నన్ను ఆ విమానంలోకి యెక్కించేశాడు. అది, గభిక్కున, బుయ్‌మంటూ, ఝామ్మని, మాయింటిమీద రెండాకంటే, పక్కింటి పిన్నిగారి కొబ్బరిచెట్టుకంటేగూడా, హింకా బోల్డు ఎత్తు పైకి ఎగిరిపోయింది. "వురేయ్ విమానంవాడూ, నన్నెక్కడికి తీసుకుపోతున్నావు" అని అడిగితే, వాడు మొదట చెప్పలేదు. కాంశేత బాబాయిని పిలుస్తానని భయపెట్టేశాను. పాపం, వాడు భడిసిపోయి, 'దుకేం లేదు. మా చంద్రలోకంలో నీలాంటి అబ్బాయి వుంభోడు వున్నాడు. వాణ్ణిన్ను తీసుకురమ్మన్నాడు." అని చెప్పేశాడు.

విమానం మబ్బుల్లోంచి, భలే స్పీటుగా పైకి ఎగిరిపోతోంది. విమానంవాడు "నీకు భయం వేస్తోందా" అని అడిగాడు.


అప్పుడు నేను "నాకు విమానాలంటే భయం లేదులే. కిందటి జన్మలో చాలాసార్లు బోల్డు విమానాలూ, నిర్ఝంఝుటకాలూ ఎక్కేవాణ్ణి" అని చెప్పాను. నిమిషంలో, మా విమానం, చంద్రుడిదగ్గిర్కి వచ్చి, చంద్రలోకంలోకి వచ్చేసింది. అక్కడంతా చీకటిగావుంది. 'మీవూళ్ళో ఎలక్ట్రీదీపాలూ అవీ

## వి. పరబ్రహ్మశాస్త్రి

లేవా. మందస్తుగా చెపితే, మాబామ్మనడిగి ఓదీపం తెచ్చేవాణ్ణిగదా' అన్నాను. అప్పుడు వాడు నవ్వేసి, "హుష్! యిదంతా వూరి బయటచోటు. అంచేతిలా చీకటిగా వుంది. వూళ్ళోకిపోతే ట్యూబులైట్లూ, కిర్సనాయిలు బుడ్డీలూ అవీ అన్నీ వుంటయ్యి" అని చెప్పాడు. యింతలో విమానం, ఓ మేడ దగ్గరికి వచ్చి ఆగిపోయింది. విమానంవాడు నన్ను ఆ మేడలోకి రమ్మన్నాడు.

సరేనని, నేను యింటోకి వెళ్ళాను. నా యెదురుగ్గా ఓచిన్న అబ్బాయి వచ్చేసి, నన్ను గాటిగా ముద్దెట్టేసుకున్నాడు. "వురేయ్! నీ పేరేమిట్రా" అని అడిగాను; వాడు వెంటనే. "నా పేరు బుడుగు" అన్నాడు. "మరి నేను బుడుగు నేకందా" అని అనేశాను. అప్పుడు వాడు "నీపేరు B బుడుగు, నా పేరు C. బుడుగు. B. అంటే భూలోకం, C. అంటే చంద్రలోకం" అని చెప్పేసి, నన్ను చూసి కొంచెంసేపు నవ్వేశాడు. నాకుకోపంవచ్చేసి వాడితో "అలా నవ్వకూడదు. నవ్వితే పళ్ళు నష్టాలుట" అన్నాను. అప్పుడువాడు "ఓస్ మరి నాలుగుఅంటే మా చంద్రలోకంలో కున్నాగందా, అందుకని యేం నష్టం వుండదు" అన్నాడు.

"వురేయ్ C. బుడుగూ, అసలు నా సంగతి, నీకు ఎల్లా తెల్సిందిరా" అని అడిగాను. "ఓస్స్! మాయింటో, ఓ పెద్ద మాజిక్కు అద్దం వుందిలే! దాంటో, నువ్వూ, మీ శీగానపెసూనాంబా, ప్రక్కింటి పిన్నిగారి మొగుడూ, హింకా అనేకంమందిలూ కనిపించారు" అన్నాడు. తరవ్వాత, ఆC. బుడుగ్గాడు, నన్ను "వురేవ్, బీడీ కాలుస్తావా" అని, నాకో బీడీ యిచ్చాడు. వాళ్ళలోకంలో, ఛలి బాగా వుంటుందిట. అందుకని, వాళ్ళంతా యెప్పుడూ బీడీలు కాలుస్తారుట. మరినాకేమో కాల్చటం చేతగాదుగందా! వొందుకని వద్దన్నాను. అయినా వాడు నా మాట వినలేదు. "మీ బామ్మవాళ్ళు చూడ్రులే, కాల్చు" అని, అనేసి, నాకో బీడీ ముక్కిచ్చేశ్శి, వాడు, వాళ్ళమ్మనడిగి లడ్డూలా,



చంద్రలోకంలో B. బుడుగు, C. బుడుగు

# ★ బుడుగు చంద్రలోక యాత్ర ★

జిలేబీ, శెనగపప్పూ అవీ తీసుక్కురావటానికి యింట్లోకిపోయాడు. గబుక్కున, నాకో అయిడియా తట్టేసి, ఆబీడీ ముక్కని లాగూ జేబులో దాచేశాను. వాడు మళ్ళీ వచ్చి, కాల్చావా అని అడిగాడు. 'ఓస్స్! యింత సేపా, సెకండుకి సవాలక్ష బీడీలు కాల్చెయ్యగలను' అని, వాడికో పెద్దస్టంటు కొట్టేశాను. పాపం, వాడు నిఝంగా హాశ్చర్యం పడిపోయేశాడు. అయినా, మళ్లీ మూణ్ణిముషాల్లో మామూలుగా నేఐపోయ్యాడనుకో. తరవాత్తె, లడ్డూలూ అవన్నీ వాక్కాసినిచ్చి, వాడుగూడా నాలుగో, సున్నాయో తినేశాడు.

ఇంతలో, యిదివరకటి, విమానంవాడు (వీడుం. బుడుగ్గాడినాన్నట!) వచ్చేసి, చాలారాత్రి అయింది కాబట్టి, పడుక్కోమన్నాడు. నేనుం. బుడుగుగాడితో యింటికెళ్లిపోతాను అన్నాను. "రేపు మాయాబజారుమాత్రం చూస్నేసి వెళ్దువుగానిలే" అని వాడన్నాడు. మరి నాకేమో, నిఝంగా నిద్దరావట్లేదు. అయినా పడుక్కోవాల్సిగందా! సరేనో పావు నిమిషంసేపు దొంగ నిద్రపోయాను. (ప్రైవేటు మేస్ట్రు వచ్చినప్పుడు, దొంగనిద్రపోతున్నట్టు నటించటం, నాకు బాబాయి ఇదివరకే నేర్పేశాడు. అస్సలు ఈ విద్య మా బాబాయికేమో, వాళ్ళ బాబాయీ వాళ్ళబాబాయి నేర్పేట!) హాందుకని యిప్పుడు C. బుడుగ్గాడిక్కి నా ట్రిక్కు తెలీదులే.

పాపం వాడు గురకపెట్టి పడుక్కున్నాడు. కుంచెం సేపయింతర్వాత, వాణ్ణి నిద్దర్లేపి, ఒకటికి వెళ్లాలన్నాను. నిఝమనుక్కుని, వాడు నమ్మేశాడు. నమ్మేసి, "మా విమానం షెడ్డుదగ్గిర్కి వెళ్ళి పోస్కో" మన్నాడు. అప్పుడు నాకో అయిడియా తట్టేసి, విమానం షెడ్డులోకివెళ్ళి, విమానంలో యెక్కేశాను. అది మనం ఎక్కడికి పోమంటే అక్కడికి వెళ్ళిపోతుంది. ఇలాని సి. బుడుగు చెప్పాడు. హాందుచేత (ప్రిచేత అనిగూడా అనొచ్చు.) మా యింటికి పోనిమ్మన్నాను. నిమిషంలో అది ఝూమ్మంటూ, రష్షియావాళ్ళ చందమామకంటే స్పీటుగా భూమివైపు దిఘిపోతోంది. దానిమోతకి, సి. బుడుగుగాడు, వాళ్ళ నాన్న అమ్మ అందరూ లేచి, బయటికివచ్చి నన్ను వెనక్కి వచ్చెయ్యమని కేకలేశారు. అప్పుడు నాకు భలే భయం వేసింది. అయినా మన్ని భయం యేమ్మీచెయ్యదుట. (యిలాని యిదివరకు పకోడీలు తెచ్చే ఓ మేష్ట్రు చెప్పాడు.) అందుకని విమానాన్ని, హింకా బోల్డు స్పీటు పెట్టేశాను. మూణ్ణిముషాల్లోనో, ముప్ఫయ్ సెకండ్లలోనో అది సరాసరి మా దొడ్లోకి దిఘిపోయి, నన్ను దింపేసి, మళ్ళీ వెనక్కి ఎఘిఱిపోయింది.

హాశ్చర్యం! మంటింటి తలుపులు యింకా తీసేస్నేవున్నాయ్. హింకా డబుల్ హాశ్చర్యం!! అక్కడ దొడ్లో మా బాబాయి రెండు జెడల సీత్తో మాట్లాడుతున్నాడు. నన్ను చూసి, రెండుజెళ్ళ సీత పారిపోయింది! నాన్నతో చెప్తానేమోనని, బాబాయి నన్ను పారిపోకుండా గాటిగా పట్టుకోటానికి వచ్చాడు. నేను బోల్డు ట్రై చేసి అమ్మదగ్గిర్కి పరిగెత్తాను అయినా మరి వెనకాల బాబాయి పరిగెట్టుకు వస్తున్నాడు గదా. అందుకని గాటిగా అరిచి అమ్మని నిద్దర్లేపాను. అమ్మ లేచి "యెప్పుడూ, వెధవ కలవరింతలూ, వీడూనూ" అని అనేసి నా నెత్తిమీద ఫడో, ఓటో టెంకిజెల్లలిచ్చింది. నాకు ఖోపంవచ్చి కళ్లు తెరిచి చూశాను. హాశ్చర్యం!!! నేనిందాకట్నించీ అమ్మదగ్గిరే పడుకునివున్నాను. యిదంతా కలట!!! కాని, హాశ్చెరంవు! రేయ్ జేబులో బీడీముక్కలూ మాత్రం ఉన్నాయిరోయ్!! ★

